మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నిండుకుండలా సింగూరు ప్రాజెక్టు

### ప్రారంభమైన విద్యుత్ ఉత్పత్తి



**పుల్కల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** వరద ఉధృతి కొనసాగుతుండటంతో బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నిండుకుండలా కళాకళలాడుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ఈ పాటికే ప్రాజెక్టులోకి 28.114 టీఎంసీలు నీరు చేరినట్లు ప్రాజెక్టు అధికారులు ధృవీకరిస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఎగువ నుంచి ప్రాజెక్టులోని నీరు పారుకుని వస్తోంది. ప్రాజెక్టులోకి ఈ పాటికే 15.332 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని, మరో రెండు టీఎంసీల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు పూర్తిగా నిండితే దిగవకు నీటిని వదలుతామని నీటి పారుదల శాఖ డిప్యూటీ నాగరాజు పేర్కొన్నారు.

## విద్యా శాఖ మంత్రి సబితారెడ్డిని కలిసిన సర్పంచ్

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కరస్‌గుత్తి గ్రామ సర్పంచ్ సంజీవరెడ్డి గురు వారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్బంగా సర్పంచ్ సంజీవరెడ్డి మాట్లాడుతూ శివహంసారుఢ ప్రభు సేవా సమితికి సంబంధించిన స్థలం కేటాయింపు విషయమై మంత్రిని కలిసినట్లు పేర్కొన్నారు. స్థలం కేటాయింపుకు మంత్రి సానుకూలంగ స్పందించినట్లు సర్పంచ్ సంజీవరెడ్డి వివరించారు.


విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని కలిసి జ్ఞాపికను అందిస్తున్న సర్పంచ్


మంత్రి హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

## లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయండి

### -తనవంతు సహకారం అందిస్తా మంత్రి హరీష్‌రావు

**గజ్వేల్, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త):** లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. గురువారం ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ లయన్స్‌క్లబ్ నిర్వాహకులు మంత్రి హరీష్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజ సేవలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు సొంత డబ్బులు వెచ్చించి చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేస్తున్నారని, లయన్స్‌క్లబ్ సేవలకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. గజ్వేల్‌లో లయన్స్‌క్లబ్ భవన నిర్మాణానికి సహకారం అందించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేయగా మంత్రి హరీష్‌రావు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మతీన్, మదర్సా చైర్మన్ హైదర్ పటేల్, శ్రీ కొండపోచమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ గోలి సంతోష్, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు నేతి శ్రీనివాస్‌గుప్త, మాజీ అధ్యక్షుడు సంజయ్‌గుప్త, గుడాల రాధాకృష్ణ, సత్యనారాయణ, అమర నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లను సందర్శించిన అడిషనల్ డిసిపి


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డిసిపి మల్లారెడ్డి

**చేర్యాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :** చేర్యాల,కొమురవెళ్ళి , మద్దూర్ పోలీస్ స్టేషన్ల, పోలింగ్ కేంద్రాలను లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి యస్.మల్లారెడ్డి గురువారం సందర్శించారు. మూడు మండలాల్లో నమోదవుతున్న కేసుల, సిసి కెమెరాల తీరు ఎలా ఉందని ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సిసి కెమెరాలు పని చేయకపోతే కమ్యూనిటి పోలిసింగ్ నేను సైతం ద్వారా వెంటనే రిపేర్ చేయించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారునితో మర్యాదగా మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల పరిశోధన పారదర్శకంగా ఉండాలని ప్రతి కేసులో క్వాలిటి ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ బ్లూకోర్డ్స్ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లు మర్రిముచ్చాల, లద్నూర్, చిటా ్యల పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయనతో చేర్యాల సిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, కొమురవెళ్ళి ఎస్సై నాగరాజు, మద్దూర్ ఎఎస్సై జగదీశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలి

### కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ షాహీన్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు షాహీన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ మహిళా విభగాంపై ఎంతైనా ఉందని అ పార్టీ మహిళా విభాగం కో-అర్డినేటర్ షాహీన్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో అమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందని తెలుపాలన్నారు. సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిఅర్ఎస్ పార్టీ అన్ని వర్గాలకు అన్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, పరిశీలకులు రెజీనా, శాంతమ్మ, ముద్దం లక్ష్మీ, ప్రణవి, నరసవ్వ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు హెచ్ఐవిపై అవగాహన

**గజ్వేల్, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):** గజ్వేల్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లో ఆటో యూనియన్ నాయకులకు, ఆటో డ్రైవర్లకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సేవా సంఘం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గజ్వేల్ అవుట్ రీచ్ వర్కర్స్ విజయ, పూర్ణిమ, లక్ష్మి, నవనీత, భవాని, సౌజన్య, ప్రమీలలు పాల్గొని అవగాహన కల్పించారు. ఆటో యూనియన్ నాయకులు స్వామి, నరేష్, అక్బర్, చంద్రం, కాసిం, దశరథ, నవీన్, రామస్వామి, లింగం, సత్యం, అక్బర్ పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉసికె బావి ప్రాథమిక పాఠశాల

## కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రహరీ గోడ.. కొనసాగుతున్న తరగతులు



శిథిలావస్థలో ఉన్న ఉసికె బావి ప్రాథమిక పాఠశాల

**అమీన్‌పూర్, సెప్టెంబర్7 ప్రభాతవార్త:** ప్రభుత్వ విద్యను పటిష్టం చేస్తున్నామని, అందుకు తగ్గట్లు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. మన ఊరు మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తామని చెబుతుండగా కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి అధ్వానంగా మారింది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉసికె బావి ప్రభుత్వ పాఠ శాల అధ్వాన స్థితిలో ఉంది. చినుకు పడితే చాలు తరగతి గదులు ఉరుస్తున్నాయి. ఎప్పుడు ఊలిపోతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న పాఠశాల భవనాన్ని చూస్తే విద్యార్థుల్లోనూ, ఉపాధ్యాయుల్లోనూ ఆందోళన నెలకొంది. బ్రతుకు ఫణంగా పెట్టి బడికి వెళ్లాలా అనే ప్రశ్న విద్యార్థుల్లో తలెత్తింది. శిథిలావస్థలో ఉన్నటువంటి పాఠశాలకు తమ పిల్లలను పంపించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పాఠశాల భవనం మరింత శిథిలావస్థకు చేరుకుందని, భవనం కూలి భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రక్కను ముళ్ల పొదలు, ప్రహరీ గోడకు పెద్ద రంధ్రం ఉండటంతో విష సర్పాలు, క్రిమీ కీటకాలు రావడం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు భయభ్రాంతులకు గురువున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.


లీక్ అవుతున్న పాఠశాల స్లాబ్

**ఎమ్మెల్యే సార్ జర దృష్టి సారించండి**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుదుతున్నారు. ఉసికె బావి ప్రాథమిక పాఠశాలను మన ఊరు మన బిలో చేర్చి సమస్యల వలయంలో ఉన్న పాఠశాలను విద్యార్థులకు కనీస అవసరాలు కల్పించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఎంఈవో రాథోడ్ వివరణ**

ఉసికె బావి మండల ప్రాథమిక పాఠశాల విథిలావస్థకు చేరు కొని అస్తవ్యస్తంగా ఉందని, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బం దులు పడుతున్నారని జిల్లా విద్యాధికారికి, జనరల్ బాడీ మీటింగ్‌కు నివేదిక పంపించడం జరిగిందని తెలిపారు. ఏదైనా ఫండ్ వస్తే మొదటి ప్రాధాన్యం కింద పాఠశాలకు మరమ్మత్తులు చేయించడం జరుగుతుందని, అలాగే రెండో దశలో మన ఊరి మన బడి కార్యక్రమంలో చేర్చడం జరుగు తుందని తెలిపారు.

## దుర్గమ్మ సాక్షిగా ఒక్క రూపాయి అవినీతి చేయలేదు



వనదుర్గమ్మ సన్నిదిలో విలేఖరులతో మాట్లాడుతున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** మెదక్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనులు చేస్తున్నా మని, ఏ ఒక్క రూపాయి అవినీతికి పాల్పడలేదని ఇఫ్కో డైరెక్టర్ ఏడుపాలయ వనదుర్గా భవాని మాత సాక్షిగా పేర్కొన్నారు. తను అవినితికి పాల్పడినట్లు కొందరు పనిగట్టుకుని (గతంలో తనతో లబ్ధిపొందిన వారు) పత్రికలకు ఎక్కారని, అవినీతికి పాల్పడకుంటే తడి బట్టలతో వనదుర్గా దేవిని దర్శించుకోవాలని చేసిన సవాల్‌ను స్వీకరించి గురువారం అమ్మవారిని దర్శించుకున్నట్లు దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ఆవరణలో స్థానిక విలేఖరులతో దేవేందర్‌రెడ్డి భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ కాంట్రాక్టర్లు, అధికారుల వద్ద ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని, నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ఎమ్మెల్యే పద్మా, తాను పని చేస్తున్నామని వివరించారు. జిల్లాకు చెందిన ఓ అధికారి తమపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఆరోపణలు చేశారని, దాంతో సిఎం తమను మందలించినట్లు వచ్చిన పుకార్లలో ఏమాత్రం నిజం లేదని పేర్కొన్నారు. కోనాపూర్ సొసైటీలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు కొందరు ఆరోపిస్తున్నారని, తాను సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించే నాటికి సొసైటీ 30 లక్షలతో నడుస్తోందని, తాను చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించాకే ఇప్పుడు 40 కోట్ల టర్నోవర్‌కి తీసుకెళ్లామన్నారు. సొసైటీ నుంచి 40 గ్రామాలకు ఫర్టిలైజర్స్‌ను అందిస్తున్నట్లు గుర్తు చేశారు. శం కరంపే టలో భూ ఆరోపణలు, ఇసుకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు చేయడం పూర్గిఆ అబద్ద మని దుయ్యబట్టారు. కొందరు సామాజికసేవ పేరుతో తిరిగాడుతున్నారని, వారు చేసేది తక్కుత ప్రచారం ఎక్కువని దుయ్యబట్టారు. తాము సామాజిక సేవ కార్యక్రమాలు (లక్షలాది రూపాయలు వెచ్చించి డ్రైవింగ్ లైసెన్సులు మెదక్, రామాయంపేటల్లో పోలీసు శిక్షణ కోసం ఖర్చులు చేసుకున్నా) అనేకం చేసినా ఏ నాడు ప్రచారం చేసుకోలేదని గుర్తు చేశారు. అనేకం చేశామని, కాని ప్రచారం చేసుకోలేదని గుర్తు చేశారు. తమ సంపాదనలో 80 నుంచి 90 శాతం సమాజ సేవకై వినియోగిస్తామన్నారు. ఏడుపాలయ ఇఓ ద్వార తనకు వాటా కానీ, రుపాయి కానీ వచ్చేది కాదని స్పష్టం చేశారు. ఏడుపాయల ఆలయా నికి అసిస్టెంట్ కమీషనర్ క్యాడర్ ఉన్న ఈఓ అవసరమని ఆలయ పాలక వర్గానికి చెప్పింది తానేనన్నారు.నియోజకవర్గంలో దాదాసేగా 500 దేవాలయాలకు ఆర్థిక సహా యం అందచేశామన్నారు. పేద కుటుంబాల వారికి సహకారం అందించామన్నారు. సోషల్ సర్వీస్ చేయడానికి రైస్ మిల్ అసోసియేషన్ వారు బియ్యం అందించారని, బిల్లులు అందేలా చేసినందుకు ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లు ఆర్థిక సహాయం చేయగా దాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం జరిగిందని పేర్కొన్నారు. ఏ ఒక్కరి వద్ద తను కమీషన్ తీసుకోలేదని ప్రమాణం చేశారు.

**తరలివచ్చిన బిఆర్ఎస్ శ్రేణులు-జాతరను తలపించిన ఏడుపాయల**

ఏడుపాయల వనదుర్గా భవాని మాత సన్నిదిలో తడి బట్టలతో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ప్రమాణం చేయనున్నట్లు తెలుసుకున్న నియోజకవర్గంలోని ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున వాహనాల్లో (5వందల కార్లు, 2వందల బైకులు) ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు జాతరను తలపిం చాయి. ఏడుపాయల నుంచి మెదక్ పట్టణం వరకు బిఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, రైతు జిల్లా సమన్వయ సమితి అధ్యక్షులు సోములు, ఏడుపాయల చైర్మన్ బాలగౌడ్, రామాయం పేట, మెదక్ మున్సిపల్ చైర్మన్లు జితేందర్‌గౌడ్, చంద్రపాల్, మెదక్, పాపన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌లు బట్టి జగపతి, వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, జితేందర్‌గౌడ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికలు నిర్వహణకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలి

### ఎన్నికల అధికారి ఆర్డీవో బెన్‌షాలోమ్


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో బెన్‌షాలోమ్

**హుస్నాబాద్,సెప్టెంబరు7,ప్రభాతవార్త :** రానున్న అసెంబ్లీ ఎన్నికలను నియోజకవర్గంలో సాఫీగా నిర్వహించేందుకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అధికారి, హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్ పోలీస్ అధికారులను ఆదేశించారు.గురువారం రోజున పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉన్న అసెంబ్లీ సెక్టోరియల్ అధికారులతో పాటు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌లతో ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్బంగా ప్రతీ పోలింగ్ కేంద్రం రూట్ మ్యాప్‌లతో పాటు సమస్యాత్మకమైన కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పటిష్ట బందోబంస్తు ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో మదూ జిల్లాల సెక్టోరియల్ అధికారులతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో ఏసిపి ప్రత్యేక సమావేశం**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృశ్య జిల్లాల సరిహద్దు ప్రాంతాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్ హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో గురువారం రోజున సరిహద్దు జిలా ్ల పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అంతే కాకుండా మద్యం,నగదు సరఫరా, నియంత్రణ కొరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు.సరిహద్దు ప్రాంతాల్లో ప్రారంభ, ముగింపు మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేపి పకడ్బంది తనిఖీలు చేపట్టాలన్నారు.అన్ని జిల్లాల పోలీసులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి సంబందిత అధికారులకు ఎప్పటికప్పు డు సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలన్నారు.ఈ సమావేశంలో హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్,ఎస్‌ఐ తోట మహేష్‌తో పాటు ఆయా మండలాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకుందాం : చంద్రం


పాతయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడ్ యాత్రను స్ఫూర్తిగా తీసుకొని నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేద్దామని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర గురువారంతో యేడాది పూర్తి కావడంతో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బిజెఆర్ చౌరస్తా నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భగంం టపాసులు పేల్చి కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్‌గాంధీ చేపట్టిన యా త్రకు ప్రజల నుంచి ఎంతో స్పందన లభించిందన్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి దేశంలో ఎవరూ చేపట్టిన విధంగా రాహుల్‌గాంధీ జోడో యాత్ర చేపట్టారని తెలిపారు. 145 రోజుల్లో 12 రాష్ట్రాల్లో 4081 కిలో మీటర్ల పాదయాత్ర చేయడం ఇంత వరకు ఏ నాయకుడు చేయలేదని కేవలం రాహుల్‌గాంధీకి సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి పేదలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.డి.ఇమామ్(అత్తు), తప్పెట శంకర్, బిక్షపతి, మిట్టపల్లి గణేష్, రమేష్, గయాజుద్దీన్, గ్యాదరి మధు, ఫయా జ్, అశోక్‌గౌడ్, మెరుగు రాజు, నరసవ్వ, స్వప్న, కనకయ్య, రాశాద్, రాకేష్, శాబుద్దీన్, యాదగిరి, అరిఫ్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద నివాళ్ళు అర్పిస్తున్న సర్పంచి రాజిరెడ్డి, వర్గ సభ్యులు

## బిఆర్ఎస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిక !

### అయోమయంలో కార్యకర్తలు

### సవాలు, ప్రతి సవాళ్లుతో రచ్చకెక్కుతున్న 'పేట' రాజకీయం

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 7,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీలో రోజు రోజుకు వర్గ పోరు పెరుగుతుంది. అంతర్గతంగా రెండు వర్గాలుగా చీలిపోవడంతో ఏ వర్గం వైపు ఉండాలో అయోమయ స్థితిలో కార్యకర్తలు ఉన్నారు. కొన్ని రోజులుగా ఏడుపాయల వన దుర్గామాత అమ్మవారి ఆభరణాలపై ఎమ్మెల్యే పద్మ, ఆమె భర్త దేవేందర్‌రెడ్డిలు అవినీతికి పాల్పడ్డారని పట్టణ సర్పంచి రాజిరెడ్డి, వర్గం సభ్యులు ఆరోపించారు. దీటుగా చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడు రాజు సర్పంచి రాజిరెడ్డిపై విమర్శలు చేశారు. పరస్పర విమర్శలతో పేటలో రాజకీయం రోజు రోజుకు వేడెక్కుతుంది. ఇరు వర్గాలలో పచ్చగడ్డి వేసిన భగ్గుమనేలా ఉంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఇరు వర్గాల వారు ముఖ్యంగా సోషల్ మీడియాలో దాడు చేసుకుంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇఫ్కో డెరెక్టర్ దేవేందర్‌రెడ్డి స్పందించి తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని ఏడుపాయల వన దుర్గామాత ఆలయంలో తడి బట్టలతో ప్రమాణం చేస్తానని సవాలు విసిరారు. సవాలును స్వీకరించిన మైనంపల్లి రోహిత్ వర్గం గురువారం బారీ ఎత్తున ద్విచక్రవాహనాలపై ర్యాలీగా చిన్నశంకరంపేట నుండి ఏడుపాయల ఆలయానికి బలుదేరి వెళ్లారు. దేవేందర్‌రెడ్డి ఆలయం లో ఉన్నంత సేపు బయపడే పట్టణ సర్పంచి రాజిరెడ్డి, నాయకులను ఇంటి నుండి రానీయకుండా పోలీసులను ఎందుకు పంపారని, దీనికి సమాదానం చెప్పాలని రోహిత్ వర్గం సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఏలాంటి అవినీతికి పాల్పడకపోతే పోలీసులను పంపించి అడ్డుకోవడం సిగ్గుచేటని రాజిరెడ్డి అన్నారు. అవినితి పరాకాష్ట అని, జిల్లాలో ఏ పని చేయాలన్నా ముల్లే ముడితేనే పనులు జరుగుతామని ఆయన ఆరోపించారు. మెదక్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని వారు డిమాండ్ చేశారు. లేని యేడల పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని, పద్మాదేవేందర్‌రెడ్డిని జిల్లాలో ఎక్కడ పర్యటించిన అడ్డుకుంటామని సర్పంచి రాజిరెడ్డి హెచ్చరించారు. తొమ్మిదేళ్ల పాలనలో జిల్లాలో చేసిన అభివృద్ధి పనులు శూన్యం అని, ముఖ్యమంత్రి పర్యటన ఉండటంతో జిల్లాపై ప్రేమ కురిపించి అప్పటికప్పుడే తాత్కాలికంగా పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. పక్కనే ఉన్న సిద్దిపేట జిల్లాను చూసైనా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నేర్చుకోవాల్సి ఉందని ఎంతైనా ఉందన్నారు. మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్‌రావుకు టికేట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని, అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తామని వారు తెలిపారు. అంతకు ముందు చిన్నశంకరం పేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఒకే పార్టీలో రెండు వర్గాలు ఏర్పడటంతో ఎవరి వైపు ఉండాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**దబ్బాక, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** దుబ్బాక మండల పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తడకమడ్ల విశ్వం అలాగే దుబ్బాక పట్టణంలో కాల్వ లింగం మత్తు మూర్తి కాల్వ నర్సవ్వ ఇటీవలే మృతి చెందగా ఇట్టి విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ యుజన నాయకుడు సోలిపేట సతీష్ రెడ్డి ఇరు కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించాడు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే దుబ్బాక పట్టణంలో పాక్స్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ కాలుకి గాయమై అనారోగ్యంతో బాధపడుతున్న నరేష్‌ని పరామర్శించారు. వీరి వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


గొర్రెలను పంపిణి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## గొర్రెలను పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే

**సదాశివపేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన గొల్లకురుమలకు గురువారం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ గొర్రెలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు కొనియాడారు. కార్యక్రమంలో వెటర్నటీ డాక్టర్ కళ్యాణి, కౌన్సిలర్ విద్యాసాగర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు కూడూరి అంజయ్య, సదాశివపేట పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు చిలమల్లన్న, మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, ఎంపిటిసి, సర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సునీతా సుధాకర్, సలావుద్దీన్, సిద్దన్న, గొల్ల అశోక్, నర్సింలు, మాణిక్, కిష్టయ్య, పెద్దగౌడు సూర్‌రెడ్డి, మహిపాల్, నరసంహారెడ్డి, రాధాకృష్ణ, ఇస్మాయిల్, నారాయణతదితరుల పాల్గొన్నారు.

### ఖమ్మంపల్లిలో...


గొర్రెలను పంపిణి చేస్తున్న జడ్పీటిసి పైతర మీనాక్షి సాయికుమార్

**మునిపల్లి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో గురువారం జడ్పీటిసి సభ్యురాలు పైతర మీనాక్షి సాయికుమార్ గొల్ల కురుమలకు గొర్రెలను పంపిణి చేశారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సూచనల మేరకు రెండవ విడత గొర్రెలను లబ్దిదారులకు అందచేసినట్లు జడ్పీటిసి వివరించారు. గొర్రెలు అందుకున్న లబ్దిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్దిదారులు జడ్పీటిసి సభ్యులకు శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపార. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మండల అధ్యక్షులు విజయ్‌కుమార్, నాయకులు రామకృష్ణ, మాణయ్య, బుర్ర సురేష్, తుడుం రాజేందర్, కరుమ సంఘం నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## నేడు జహీరాబాద్‌లో చెరుకు రైతుల సమావేశం

**జహీరాబాద్‌ర సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ఈ నెల 9వ తారీఖున జహీరాబాద్ పట్టణంలోని పివిఆర్ గార్డెన్‌లో చెరుకు రైతుల సమావేశాన్ని నిర్వహించనట్లు రైతు నాయకులు జి కొండల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పివిఆర్ గార్డెన్‌లో జరిగే సమావేశానికి నియోజకవర్గంలోని చెరుకు రైతులు, రైతు సంఘాల నాయకులు, ట్రైడెంట్ చక్కర కర్మాగార కార్మికులు హాజరు కావాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా కేవలం చెరుకు రైతుల సమస్యలపై సమావేశంలో చర్చించి అందరి సూచనల మేరకు భవిష్యత్తు కార్యచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

## మల్గిలో యువతకు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ


మల్గిలో యువకులకు డ్రైవింగ్ లైసెన్సులు పంపిణి చేస్తున్న సర్పంచ్

**న్యాల్‌కల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సహకారంతో యువతకు అందిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్సులను గురువారం మండలంలోని మల్గి గ్రామంలో యువతకు (50 మందికి) అందచేశారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సులు పొందాకే వాహనాలను రోడ్డుపైకి తీసుకుపోవాలని గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు జెట్‌గొండ మారుతి పేర్కొన్నారు. ఉచితంగా యువకు డ్రైవింగ్ లైసెన్సులు అందేలా చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు వివనంద శ్రీపతి, వార్డు సభ్యులు విఠల్, సిద్దారెడ్డి, బాలాజీ, శన్ను బేగం, ముజామిన్, యువజన నాయకులు అఖిల్ మియా, కృష్ణ, మారుతి, మహేష్, నగేష్, యువకులు పాల్గొన్నారు.

## గొల్లగూడెం గొర్రెల పెంపకం సంఘం నియామకం

### -మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఎన్నికైన సభ్యులు


మాజీ ఎమ్మెల్యేను కలిసిని గొర్రెల పెంపకం సహకార సంఘం బాధ్యులుల

**సదాశివపేట, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** మండలంలోని గొల్లగూడెం గ్రామ గొర్రెల పెంపకం దారుల ప్రాథమిక సహకారం సంఘం ఎన్నికలు గురువారం ముగిసాయి. సంఘం అధ్యక్షులుగా కుల్కూర్ మల్లేశం, జినాంపూర్ తిరుమల్,ఉశిన భరత్, కుల్కూర్ ఎల్లయ్య, కుల్కూర్ ఆంజనేయులులుగా ఎన్నికవగా గ్రామస్థుల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత పభాకర్ ఎన్నికైన సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కుఉమ సంఘం జిల్లా నాయకులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు కురుమ, నంది కంది ఎంపిటిసి సభ్యులు సునీత సుధాకర్, మండల కురుమ సంఘం యువత అధ్యక్షులు కోల్కూరు సంగమేశ్వర్, ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ మాజీ డైరెక్టర్ పెద్దగొల్ల నగేష్ కురుమ, సంగారెడ్డి నియోజకవర్గ కురుమ యువత అధ్యక్షులు సోమశేఖర్ కురుమ, వెంకటాపూర్, పోట్‌పల్లి గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షులు తోగర్‌పల్లి రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజారోగ్య కేంద్రాలకు విరాళం అందించిన నెక్స్ట్ ట్రాకర్

ఇంటెలిజెంట్ సోలార్ ట్రాకర సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందించే ప్రముఖ సంస్థ నెక్స్ట్ ట్రాకర్ వెనుకబడిన తరగతులకు సాధికారత కల్పించడానికి ఎన్‌జీవో సంస్థ అయిన సమర్థనమ్ ట్రస్ట్‌ఫర్ ది డిసేబుల్డ్‌తో భాగస్వామ్యం చేసుకుని సంగారెడ్డి జిల్లాలో ఉన్న కొండాపూర్, ఆత్మకూర్‌లోని రెండు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అత్యాధునిక సోలార్ ఫోటో వోల్టాయిక్‌ని ఇన్‌స్టాల్ చేసింది. ఈ పీవీ వ్యవస్థలు 15 మా ద్యూ ళ్లను కలిగి ఉంటాయి. ఈ భాగస్వామ్యం ద్వారా ఈ ప్రాంతంలో నివసి స్తున్న 50,000 మందికి అధిక నాణ్యతతో కూడిన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించి వారి జీవితాలను మెరుగుపరచాలని రెండు సంస్థలు ఆకాంక్షిస్తున్నాయి.


శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


న్యాల్‌కల్ రామలింగేశ్వర ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటున్న గ్రామస్థులు


కృష్ణుడి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కార్పోరేటర్


శ్రీవిద్య పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

# భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త ః** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సహిత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆలయ కమిటీ నిర్వాహకులు స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మెన్ భూపాల్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ ప్రభాకర్, కార్పోరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, ఏఎంసి చైర్మెనన విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

### రామలింగేశ్వర ఆలయంలో...

**న్యాల్‌కల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో చిన్నారులచే రాధ, కృష్ణ వేషాదారణలు వేయించి అష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఆనందోత్స వాలతో కొనసాగాయి. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో భక్తులు సామూహికంగా భగవద్గీ శ్లోకాల పారాయణం చేశారు.

### పుల్కల్‌లో..

**పుల్కల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను గురువారం ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో చిన్నారులు రాధ, గోపిక, చిన్ని కృష్ణుల వేషాధారణలు వేసుకుని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణజన్మాష్టమిని పురష్కరించుకుని యువకులు, చిన్నారులు ఉత్సాహంతో ఉట్టిని పగలగొట్టడం ఆకట్టుకుంది.

### శ్రీ విద్య పాఠశాలలో ..


పుల్కల్‌లో రాధకృష్ణుల వేషాధారణలో చిన్నారులు

**పాపన్నపేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** చిన్నారి విద్యార్థుల ను చిలిపి కృష్ణుడు, బాలికలను గోపికలుగా వేషాధారణ చేసి గురువారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని శ్రీ విద్య పాఠశాలలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుడి పాటలకు అనువుగా చిన్నారులు స్టెప్పులు వేస్తూ ఉట్టిని పగలగొట్టడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నిటలాక్షప్ప, సుమన్ బాస్కర్, నరేష్, ప్రిన్సిపాల్ రవీందర్‌గుప్తా, శ్రీ సాయి పాఠశాల ప్రిన్సిపాల్ శివ, ఉపాధ్యాయులు కృష్ణ ఆర్గిల్, విలాస్, వనజ, రోజా, స్రవంతి, అపూర్వ, ప్రయాంక, అనురాధ, ఇందిరా,వసుంధర, నిర్మల, సుజాత, శీలా, రేణుక, జ్యోతి, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

### రామచంద్రాపుంలో...

**రామచంద్రాపురం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని బిహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ రుక్మిణి సత్యభామ సహిత మురళీకృష్ణ ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. పర్వదినాన్ని పురష్కరించుకుని ఆలయానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌లు పాల్గొని పూజలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేను ఉత్సవ కమిటి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పోరేగర్ పుష్పనగేష్, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, నాయకులు ఆదర్శ్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ విజయ్‌కుమార్, గ్రంథాలయ కమిటి డైరెక్టర్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కంగ్టిలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## రాహుల్ భారత్ జోడో యాత్రకు ఏడాది

### మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ర్యాలీలు

**కంగ్టి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్బంగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కంగ్టిలోని క్రాంతి చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు (జై కాంగ్రెస్, జై జై కాంగ్రెస్) చేస్తూ కిలో మీటరు మేర నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా మండల ఎస్‌టి సెల్ అధ్యక్షులు జాదవ్ జీవన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి సల్పాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మరిచిన హామీలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కంగ్టి గ్రామ కమిటి అధ్యక్షులు చందర్‌రెడ్డి, నాయకులు గౌస్, ముగులప్ప, పాండు, గోపాల్, భీమరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### మనూర్‌లో కాంగ్రెస్ ర్యాలీ

**మనూర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి ఒక సంవత్సరం పూర్తయిన సందర్బంగా పార్టీ అధిష్టానం ఆదేశాలు, మాజీ ఎంపి, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు సురేష్‌కు మార్ శెట్కార్, ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవ్‌రెడ్డిల సూచనల మేరకు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న ర్యాలీలో కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ 1 కిలో మీటరు మేర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు సాగర్, నర్సింహారెడ్డి, విద్యా సాగర్, రాజు, సంగమేష్, నాగేష్ గౌడ్, శివకుమార్, మల్లిపాటిల్, శఫీ, మాణిక్యం, వెంకట్‌రెడ్డి, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి తీర్థం పుచ్చుకున్న సామాజిక సేవకురాలు

### -శాసనసభ అభ్యర్థిత్వానికి దరఖాస్తు


హుస్నాబాద్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకుంటున్న కర్ణకంటి మంజులరెడ్డి

**హుస్నాబాద్, సెప్టెంబరు7, ప్రభాతవార్త :** సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజుల రెడ్డి గురువారం రోజున బిజెపి కేంద్ర సహాయ మంత్రి,ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి సమక్షంలో బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్బంగా పార్టీలో చేరిన మంజులరెడ్డిని కిషన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. అనంతరం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్ శాసనసభ అభ్యర్థిత్వానికి ధరఖాస్తు చేసుకున్నారు. అంతకు ముందు ఆ పార్టీ జాతీయ అధ్యక్షున్ని ఢిల్లీలో కలిసి వచ్చినట్లు సమాచార ం. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కూడా అభ్యర్థితత్వానికి దరఖాస్తు చేసుకోగా, నేడు ఇదే ప్రాంతానికి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డితో పాటు హౌజ్ ఫెడ్ మాజీ చైర్మెన్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు తనయుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి సైతం దరఖాస్తు చేసుకుటున్నట్లు అందిన సమాచారం మేరకు తెలిసింది.

## కూడవెల్లి వాగులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

### రాములు ఆచుకి కోసం పడిగాపులు కాస్తున్న కుటుంబ సభ్యులు

**దబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** కూడవెల్లివాగులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు నీటిలో పడి గల్లంతైన సంఘటన అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామ శివారులో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని ఎనగుర్తి గ్రామానికి చెందిన పిట్ల రాములు(55) వ్యవసాయంతో పాటుగా చేపల పట్టుకుంటు పట్టిన చేపలు అమ్ముకుంటు కుటుంబాన్ని పోషించుకునే వాడు. బుధవారం సాయంత్రం చిట్టాపూర్ గ్రామ శివారులో గల కూడవెల్లి వాగులో చేపలు పట్టడానికి వెళ్లాడని, తెప్పపై కూర్చుని చేపల వల వేస్తున్న క్రమంలో వరద ఒక్కసారిగి పెరగడంతో తెప్పపై కూర్చున రాములు ప్రమాదవశత్తు నీటిలో పడిపోయాడన్నారు. ఇట్టి విషయం గమనించిన గ్రామస్తులు భూంపల్లి పోలీస్‌లకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తులను ప్రమాదనికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు

ఎనగుర్తి గ్రామానికి చెందిన పిట్ల రాములు చిట్టాపూర్ గ్రామ శివారులో ఉన్న కూడవెల్లి వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైన విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునంధన్ రావు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని అదుకుంటామన్నారు.


విఠల్ రెడ్డి విగ్రహాన్నికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

## విఠల్ రెడ్డి ఆశయసాధనకై తన వంతు కృషి

### ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

**కౌడిపల్లి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్ లో నర్సాపూర్ నియోజక వర్గ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వంతో నిరంతరం పోరాటాలు చేస్తూనే బడుగుల జీవితాల్లో ఆశ జ్యోతిలు నింపిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చిలుమలు విఠల్ రెడ్డి వ్యక్తి కాదు మహాశక్తిగా ఏదురులేని రాజకీయవేత్త అని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురు వారం నాడు స్వర్గీయ విఠల్ రెడ్డి 107వ జయంతిని పురష్కరించుకోని చిలుములు వంశయులు, ఎమ్మెల్యే చిలుములు మదన్ రెడ్డి మండల కేంద్రమైన కౌడిపల్లిలో గ్రామంలో ఎస్‌బిఐకి ఎదురుగా ఉన్న ఆయన విగ్రహాన్నికి పూలమాలలు ఘనంగా నివాళ్లు అర్పించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తన చినాన్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అడుగుజాడల్లోనే నడుస్తూ, ఆయన ఆశయ సాధన కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు స్వర్గీయ విఠల్ రెడ్డి కోడల చిలుముల సుహాసిని, ఎంపిపి రాజునాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సార రామాగౌడు, యూత్ అధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడు, మహమ్మద్ నగర్ సోసైటీ వైస్ చైర్మెన్ చిలుముల చిన్న చిన్నం రెడ్డి, జెడ్పి కో అప్షన్ మెంబర్ మన్సూర్ అలీ, బిఆర్ఎస్ ఎస్‌వి రా ష్ట్ర అధ్యక్షులు సుధీర్ రెడ్డి, నర్సాపూర్ మున్సిపాల్ కౌన్సిలర్ ఆశోక్ గౌడు, ఆర్యవైశ్ జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షులు శ్రీధర్ గుప్తా, జిల్లా నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా, నాయకులు నవీన్ రావు, చంద్రం దుర్గాగౌడు, కాలేరు శివాంజనేయులు, నాయికోటి శ్యాం సుందర్ రావు పాల్గొన్నారు.

## మత్స్యకారులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


నల్లవాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** మత్స్యకారులను ఆదుకోవడమే బిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు మధ్య తరహా ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులో 11,14,000 చేప ,రొయ్యపిల్లలను ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలైన పాడి, మత్స్యకార తదితర రంగాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. గ్రామాలలో మతన్స్యకార ఆధ్వర్యంలో వృద్ధి సంఘాలను ఏర్పాటు చేసి చేపలుపట్టు వారికి నెట్‌లను రవాణ కొరకు మోపెడ్ వాహనాలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ రాంసింగ్, కల్హేర్ మండల జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బోక్కస్‌గామ్ పీఏసీఎస్ చైర్మన్ గుండు వెంకట్‌రాములు, సిర్గాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరావుపాటిల్, కంగ్టి మండల పార్టీ అధ్యక్షులు గంగరామ్,ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మత్స్యకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరణ

**రామచంద్రాపురం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవితం నేటి తరాలకు సూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల గ్రామంలో గీత పారిశ్రామిక సమకార సంఘం వెలిమెల గ్రామ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వాయి పాపన్న మొగులలను ఎదుర్కొన్న తీరును వివరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమిరెడ్డి, పట్లళ్ల రవీందర్‌రెడ్డి, సుచరిత కొమరయ్య, శ్రీశైలం, బాబ్జి, ఉమేష్, రాజ్యం మహిపాల్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, ఎక్సైజ్ శాఖ సిఐ సీతారామిరెడ్డి, వెలిమల గీత కార్మిక సంఘం అధ్యక్షులు రాజుగౌడ్, ఉపాధ్యక్షులు లింగంగౌడ్, అశోక్‌రెడ్డి, వినోద్‌కుమార్ గౌడ్, బాలకృష్ణ గౌడ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## చిట్యాల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

**చేర్యాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండలంలోని చిట్యాల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి గ్రామ సర్పంచ్ కోరారు. వాగుకు అవతలి వైపున డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక ఉండటంతో అక్కడికి వెళ్ళాలంటే దాదాపు 10కిలో మీటర్లు ప్రయాణించి వెళ్ళాల్సి వస్తుందని గ్రామ సర్పంచ్ ఎర్రబెల్లి దామ్మోహన్‌రావు తెలిపారు. చిట్యాల వాగు బ్రిడ్జి నిర్మాణ కోసం 6కోట్ల రూపాయల నిధులు మంజూరైనప్పటికి ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, చొరవతీసుకుని వెంటనే హై లేవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

## కొల్చారంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొల్చారం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కేంద్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనకు అంతం పాలకాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగులగారి మల్లేశం గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్బంగా గురువారం టిపిసిసి అదేశాల మేరకు మండల పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ పట్టణంలోని బస్టాండు నుంచి ర్యాలీని ఆరంభించారు. బస్టాండు నుంచి ప్రారంభమైన ర్యాలీ పోతంశెట్టిపల్లి టి జంక్షన్ వరకు కనసాగింది. ఈ సందర్బంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొరకు కాంగ్రెస్ పాలన రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షులు సయ్యద్‌అక్రమ్, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గొండ కృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, హైమద్, అయూబ్, డాక్టర్ బాల్‌రాజ్, యేసు రాజు, మురళీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## 7 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**రామచంద్రాపురం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని 7మందికి 3 లక్షల 1 వేయి 5వందల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను శాసన మండలి మాజీ చైర్మన్ వి భూపాల్‌రెడ్డి, కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డిలు పంపిణి చేశారు. నిరుపేదలు కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుకునేందుకు సిఎంఆర్‌ఎఫ్ చేదోడు వాదోడుగా ఉంటోందని మాజా చైర్మన్, కార్పోరేటర్‌లు వివరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

## చర్చి ప్రహరి నిర్మాణానికి రూ.5 లక్షలు

### -పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మనూర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** మండలంలోని పుల్‌కుర్తి గ్రామంలో చర్చి ప్రహరిగోడ నిర్మాణానికి 5లక్షల రూపాయలు మంజూరు కాగా గురువారం ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఈద్గా నిర్మాణానికి 3 లక్షలు మంజూరు చేసి నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్బంగా గ్రామంలోని గొల్ల కురుమలకు రెండవ విడత 12 యూనిట్ల గొర్రెలలను ఎమ్మెల్యే లబ్దిదారులకు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు అంబారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నాగేందర్, నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్‌గొండ, బిఆర్ఎష్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, నాయకులు విఠల్‌రెడ్డి సంజీవరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** రైతులను ఆదుకోవడమే బిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్ మండల పరిధిలోని బానాపూర్ గ్రామానికి చెందిన పుప్పల మాణయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు రూ.5 లక్షలరైతు బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి కేసీఆర్ బీద ప్రజల కొరకు రైతు బీమా, పథకం ప్రవేశపెట్టి ఐదు లక్షల బీమా సౌకర్యం ఏర్పాటు చేశారని అన్నారు. శివరాజ్‌పాటిల్,శరణప్ప, దేవిదాస్, శ్రీకాంత్, దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి